స్కెచ్

# ఒకే మనిషి రెండు భంగిమల్లో

వై. వి. శర్మ

నేను నర్సింహాన్ని చిన్నతనంనుంచీ ఎరుగుదును.

నర్సింహం పూర్తి పేరు లక్ష్మీనరసింహారావు. నర్సింహం అని పిలవడంకద్దు. మా యిద్దరికీ ఒక తేడా ఉంది. నేను చెప్పిన దానిని కాదనడమే వాడి స్వభావం. వైరుధ్యభావాలకు పుట్టినిల్లు వాడి మెదడు. స్కూల్లో చదువుకునే రోజుల్లో కూడా, ప్రతి డిబేట్‌లోనూ ప్రతిపక్షం వహిస్తూండేవాడు. కాని అదేమివిచిత్రమో, ఎప్పుడూ నా తీర్మానానికే మెజారిటీ వచ్చేది. అలా జరిగిన రెండురోజులవరకూ నాతో మాట్లాడేవాడుకాదు.

"మార్క్సిజం గురించి నీకేమి తెలుసునురా?" అని అడిగేవాడ్ని నేను. "నీకేమి తెలుసునురా?" అని ఎదురు ప్రశ్న వెయ్యడం తప్ప, వాడికేం తెలియదు. తనో పెద్ద మార్క్సిస్టులా (అంటే అన్ని అవస్థలూమారి యిప్పుడు ఓ చిన్న కమ్యూనిస్టు అయ్యాడు) ఆ విషయాలు తెలియని పెద్దలు దగ్గిర ఉపన్యాసాలిస్తూండేవాడు. మేం యిద్దరం బి. ఎ. పరీక్షకు కూర్చున్నాం. కాని గ్రూపులో నాకు ఫస్టు క్లాసు వచ్చిందని ఏడుపు వాడికి.

జీవితరంగాల్లో ప్రవేశించాం. జీవితం కంటకమయమయిందనేవాడు. దాన్ని తీసివేసి, బాటను పరిశుభ్రం చెయ్యాలనేవాణ్ణినేను. నా దగ్గర ఒక దుర్గుణం ఉండేది. ఉన్నమాట ముఖంమీద అనేవాణ్ణి. వాడు చెప్పిన విషయం రైటనితోస్తే, అప్పుడప్పుడు పూర్వపక్షం కూడా చేసేవాణ్ణి. "ఏంచేస్తావురా?" అన్నాను. "ఏదోఒకటి చెయ్యాలిగా" అన్నాడు. "అంటే ఏమిటో చెప్పు" నొక్కి అడిగాను. ఎలక్ట్రిసిటీ డిపార్టుమెంటులో గుమాస్తాగిరీ సంపాదించానన్నాడు. దానికి నేను, "నరసింహం! స్వతంత్ర భావాలుకల్గిన నీవంటి కమ్యూనిస్టు, బానిస భావాలతోకూడిన ఓ గుమాస్తాగిరి ఎలాచేస్తాడో అర్థంకావటం లేదు" అన్నాను. వాడు నవ్వుతూ "అబ్రహాంలింకన్‌లా ఈ దాస్య శృంఖలాలు తెగగొడ్తా"నన్నాడు "పిచ్చివాడవ్! నువ్వు అధికారం అనే మాయలో పడితే, అంతే" అన్నాను. అదే ఆఖరిసారిగా మేం యిద్దరం చిరునవ్వుతో మాట్లాడుకోవటం శలవు తీసికొన్నాం.

అలా అయిదు సంవత్సరాలు జరిగాయి. మనుష్యులయొక్క మనస్తత్వాలు రోజురోజుకూ మారే రోజులవి. న్యాయం, నిజాయితీలు అధః లోకానికి త్రొక్కబడ్డాయి. ప్రేమ, ఆదరణ అనేవి అసలే లేవు. స్వతంత్ర జీవనం సాగిద్దామని ఎన్నో తాపత్రయాలు పడ్డాను. దానికి పత్రికా రచన ఒకమార్గం అని తోచింది. ఒక పెద్ద పేరున్న పత్రికలో సహాయ సంపాదకుడుగా చేరాను. నా విధిని నేను జాగ్రత్తగా నిర్వహించేవాణ్ణి. "ఫలానావారి రచన బాగుంది" అని అనిపించుకునే స్తోమత చేకూరుంది. కాని ఒక్క విషయం. స్వేచ్ఛారహితమైన బానిసత్వంకూడా ఉండేది. కులవర్గరహిత సమాజం అని పేరు. అందులో కులవర్గాల ప్రాధాన్యం. అటువంటిది పత్రికావ్యవస్థలోనూ అంటింది. ఒకానొకరోజున ఒక వ్యంగ్యరచన చేశానని, అది తన పర్మిషను లేకుండా ప్రకటించానని ఎడిటరు నన్ను తొలగించాడు. దానికి కారణం లేకపోలేదు. ఆ వ్యాసంలోని కొన్ని హంశాలు మా సంపాదకుడు చేసే కొన్ని తప్పుడు పంథాలను నిర్నిబంధంగా ఖండించటమే. అదీకాక ఆ పోస్టు తన కులంవాడికివ్వాలని ఎడిటర్ పట్టుదల.

సరే. ఉద్యోగం పోగొట్టుకున్నవాణ్ణయాను. ఎచ్చటచూచినా నిరుద్యోగ సమస్యే తాండవమాడుతూంది. మద్రాసు పట్టణం అంతా గాలించాను. "ఖాళీలులేవు" అన్న బోర్డే ప్రత్యక్షమయ్యేది. ఏంచేసేది? ఏమిటి కర్తవ్యం? పాపం! ఈ నిరుద్యోగ సమస్యాపరిష్కారానికి పంచవర్ష ప్రణాళికలో ప్రత్యేకస్థానం యిచ్చిందట గవర్నమెంటు! ఇద్దరు పిల్లలూ నేనూ నాభార్య. వీళ్ళని ఎలాగ పోషించటం? నర్సింహాన్ని ప్రాధేయపడ్డాను. నర్సింహం ఇప్పుడు అకౌంటెంట్. నూటతొంభైఅయిదురూపాయలు జీతం. హోదాగల ఉద్యోగం. ఎలాగవుతే ఎనభైరూపాయలు

జీతం (గ్రాడ్యుయేటు ఎలవెన్సు ఆరురూపాయలు కలిపి) వచ్చే గుమాస్తాగిరీలో చేరాను.

పూర్వం ఉన్నంత చనువు తగ్గించుకున్నాడు నర్సింహం. విధిలేక చేసిన గుమాస్తాగిరీ. నర్సింహాన్ని "ఒరే" అనే సాహసం లేకపోయింది. ఒకానొకప్పుడు తనూ యీ గుమాస్తాగిరీ చేశానన్న సంగతి మర్చిపోయాడు. ప్రతి క్లార్కునీ, యేవగింపుతో అసహ్యంగా మాట్లాడుతాడు. గుమాస్తాలందరిలోనూ అసమ్మతి ప్రబలింది. ప్రత్యక్షంగా కాకపోయినా, పరోక్షంగానైనా, గుమాస్తాలందరూ నర్సింహాన్ని తిడ్తూంటారు. ప్రతివాడికీ మాటకు ముందు మెమోలు, కాన్ఫిడెన్షియల్ మెమోలు, యివ్వటం మొదలెట్టాడు. గుమాస్తాగిరీ తన జీవిత పరమావధి అనుకునే వానిగతి ఏం కావాలి? ఇటువంటి విషయాలు నీవంటివాడికి తగవని హెచ్చరించాను. అనవసర విషయాల్లో జోక్యం కల్గించుకోవద్దని అధికార పూర్వకంగా "వార్నింగ్" యిచ్చాడు. వాడికీ నాకూ ఎన్ని అంతరాలు తేడాలున్నాయా అని యోచించాను. ఒకరోజున ఒక టెంపరరీ గుమాస్తా, తను చెప్పినపని సక్రమంగా నిర్వహించలేదనే సాకుతో, ఉద్యోగంలోంచి బర్తరఫ్ చేశాడు. తాను నమ్మిన డబ్భైనాల్గురూకలుకోసం, వెట్టి చాకిరీచేశాడు ఆ గుమాస్తా. నర్సింహంలో అంతటితోనైనా నైతిక పరివర్తనం వస్తుందా అని నా అనుమానం. అధికారం అనే అంటరాని జాడ్యం మావాణ్ణి ఆవహించిందని గ్రహించాను.

నాతో యించుమించు మాట్లాడడం మానివేశాడు. దానికి కారణం, నేను వాడితో ఈ విషయాల్లో నిష్కర్షగా చెప్పటమే. అప్పటి నర్సింహానికీ, ఇప్పటి నర్సింహానికీ ఎంతో తేడా. ఆ యిద్దరి మధ్యా అధికారం అనే పెద్దగోడ అడ్డు ఉంది. నా విమర్శలధాటికాగలేక, నన్ను ఉద్యోగంలోంచి తీసివేయించాల్సి వస్తుందన్నాడు. ఒకరోజున పెద్దల ఆబ్దీకానికని సెలవడిగాను. నాకు సనాతనాచారాల్లో నమ్మకం లేదన్నాడు. అందుకని సెలవు యివ్వనన్నాడు. "ఈ బ్రహ్మసమాజిస్టుగా రంగు ఫిరాయించడం ఎప్పట్నుంచీ" అని హేళనచేశాను. మొత్తముమీద సెలవు ఇవ్వనన్నా వినకుండా వెళ్లినందుకు నన్ను ఉద్యోగంలోంచి తీసివేయించాడు.

ఒకానొకప్పుడు ఈ విషయాన్ని గురించి పశ్చాత్తాపపడకపోవు అన్నాను. నర్సింహం పట్టించుకున్నట్లు లేదు. ఇంత విశాల ప్రపంచంలో ఆమాత్రం ఉద్యోగం సంపాదించలేనా అని నా ధైర్యం.

# చైత్రరాత్రి

దవుదవ్వుల ఎలనవ్వులు
నవ్వుల్లో నవమల్లెలు;
చీకటికైశ్యం చిందిన
పారిజాత పరిమళాలు;
వెన్నెల తిన్నెల వాలిన
విహంగాలు తెలిచూపులు;
అందమైన ఆడదిలా
స్పర్శించే చైత్రరాత్రి.
చంద్రకాంత చంద్రకాంత
చెట్లనీడ నౌక ప్రగాఢ
సౌందర్యం శయించినా
సంయమనం సంచలించు.
నావిడిచిన నిట్టూర్పుల
ఆవిరి చల్లారిపోయి
దూరంగా భారంగా
తోచు గంధసారంగా.

ఎదురింటిలో దీపమార
ఎదలో వెలుగును దీపం.
ఏమయింది? ఎందుకిలా
పరితృష్ణకు ప్రకోపం?
ఎలా ఎలా మకరాంకుడి
హళాహళికి నిలబడడం?
తెలవారకమున్ను గుండె
విలవిల సముదాయించడం?
కంటినిండ కునుకురానీ
కౌముదీ నిశావేళలు
కాళరాత్రి కన్న కనా
కష్టంగా, భ్రష్టంగా
ఏమయింది? ఎందుకిలా
ఇగిరిపోవు నా హృదయం?
ఈ రాతిరి తీవచివర
విరియునెపుడు మహోదయం?

—హేమేంద్ర.